# కడి కరా!

ఆ మధ్యన నా ఫ్రెండొకడు ' వైఫ్‌ని పుట్టింటికి పురిటిపని నిమిత్తం పంపించాను, సర్దాగా ఇద్దరం వంట చేసుకు భోం చేద్దాం రమ్మంటేనే హానెస్టుగా నాకు వంటరాదని చెప్పా. ' ఛ – నాకొచ్చుగా, ఏం ఫర్లేదు ' రమ్మని హామీ ఇవ్వగా కూని రాగాలతో కాస్త ముందుగానే వెళ్ళా. నేవెళ్ళే సరికి ఫ్రెండు ఇంటికి బూజుదులుపుకుంటున్నాడు. నన్ను చూడం గానే కుర్చీలో కూర్చోమని, నా నెత్తిన ఒక దిండు గలీబు కప్పేడు– నెత్తిన దుమ్మూ ధూళి పడకుండా.

మా ఫ్రెండు బూజు దులుపుడు కార్యక్రమానికి స్వస్తి చెప్పి, స్నానం చేసొస్తానని ప్రకటించి , వెళ్ళబోతూ కుర్చీని పక్కింటి వాళ్ళ పోర్షన్ వైపు కిటికీ దగ్గరగా లాగి ' పేపరు చదువుకుంటూ ఉండు లేకపోతే పక్కింట్లోంచి చిత్రమైన సంభాషణలు వినిపిస్తాయ్. జాగ్రత్త వాటిని అర్ధం చేసుకోటానికి ట్రయ్ చెయ్యి చిటికిలో వచ్చేస్తానంటూ ' బూజుకర్రతో సహా దొడ్లోకి వెళ్ళిపోయేడు. చేతిలో పేపరుండటం చేత ఇకనేం ఆలోచించకుండా పేపరు పఠనంలో మునిగిపోయా. పది నిమిషాలు గడిచాయి. మా ఫ్రెండు చెప్పినట్టే పక్కింట్లోంచి మాటలు వినిపిస్తున్నాయి. కాని అది తెలుగు భాష కాదు ....కాస్త పరిశీలనగా వినసాగేను. సంస్కృతం అయ్యిండొచ్చు.

' కవా కడు కలే కచా కడా ! ' అంటోంది మొగ గొంతు.

' కదొ కడ్లో కకె కళ్ళా కడు ' బదులిచ్చింది ఆడగొంతు.

నేను కుర్చీని ఇంకాస్త కిటికీకి దగ్గరగా జరుపుకుని, పెన్ను తీసి విన్నదివిన్నట్లు రాసే ప్రయత్నం చేస్తుండగా , ఇంకా కొన్ని మాటలు వినిపిస్తున్నాయి.

' కవా కడి కకి కని కర్మొ కహ కమా కటం కగా కచె కప్పు ' వినిపిస్తున్నాయ్ !

' కలా కభం కలే కదు, కవా కడి కకి కపె కళ్ళాం కభ కయం '

స్నానానికి వెళ్ళిన ఫ్రెండు తిరిగొచ్చిన సంగతి నే గమనించలేదు. వాడు నా అవస్థ కనిపెట్టి పగలబడి నవ్వి ' వాళ్ళు మాట్లాడుకుంటున్నది ఏ బాషలోనో అర్ధమైందా ' అని అడిగి ఆ పైన అసలు విషయం చెప్పాడు.

ఆ సంభాషణ పక్కింటి యజమాని తల్లిదండ్రులవట. కొడుకు అరవ వాళ్ళమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాట్ట. ఆ పిల్లకి తెలుగు రాదట. కాని మాట్లాడితే కాస్త కాస్త అర్ధం చేసుకోగలదట. అంచేత కోడలి పిల్లకి వాళ్ళ సంభాషణ అర్ధం కాకుండా వాళ్లు చిన్న పిల్లలులాగా కా భాషలో మాట్లాడుకుంటారట. పోట్లాడుకుంటారట కూడాను.

నాకు ముసలి జంట పైన చెప్పలేనంత కోపం వచ్చింది, కొడుకు సుఖంగా ఉన్నాడు గదాని సంతోషించటంపోయి, భాష తెలవని కోడల్ని, కా భాషతో కాల్చుకు తినాలని వ్యూహరచని చేస్తున్న వాళ్ళని తల్చుకుంటూ –

‘ కఔ కరా అని, కఛీ కఛీ అనిపించింది.

------- అయ్యిపోయింది -------